నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, సోమవారం 16 డిసెంబర్ 2024 | SANGAREDDY


## సీఎం రేవంత్ సెల్ఫ్ అవుట్

- రేవంత్‌రెడ్డి పాలనలో మోసపోయిన ప్రజలు
- అతి తక్కువ సమయంలోనే ప్రజాగ్రహానికి గురయ్యాడు
- హామీలన్నీ ఎగ్గొట్టాడు..
- కేసీఆర్ పాలనలోనే అమీన్‌పూర్ అభివృద్ధి
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్ కేసీఆర్ క్రికెట్ టోర్నీలో బహుమతుల అందజేత





సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

అమీన్‌పూర్, డిసెంబర్ 15: సీఎం రేవంత్ రెడ్డి సెల్ఫ్ అవుట్ అయ్యాడని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌లో బీఆర్ఎస్ యువ నాయకుడు మాణిక్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ టోర్నీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి పాలన ఏడాదిలోపే (అనతికాలోనే) ప్రజాగ్రహానికి గురైందన్నారు. తనకు తానే సెల్ఫ్ అవుట్ ఆయ్యాడని ఎద్దేవా చేశారు. ఆయన ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్కటి పేదవాడికి ఇల్లు కట్టించిన పాపానపోలేదు కాని, పేదవాళ్లు కట్టుకున్న ఇండ్లను మాత్రం కూల్చి వేస్తున్నాడన్నారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధితో పాటు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో అబద్ధాల హామీలతో మాయమాటలు, ఊకదంపుడు ఉపన్యాసాలు, దేవుండ్లపై ప్రమాణాలతో ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలను మోసం చేసిన ఘనుడు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనలో అక్కాచెల్లెండ్ల డెలివరీ కోసం రూ.13 వేలతో పాటు కేసీఆర్ కిట్టు అందజేసినట్లు తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు, ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, యువకులకు ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు వంటి ఎన్నో పథకాలను దిగ్విజయంగా అమలుచేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో కేసీఆర్ ఇచ్చిన పథకాలను పూర్తిగా రద్దు చేసి ఆరు గ్యారంటీలు ఇస్తానని దేవుళ్లపై పెట్టిన ఒట్లు మూటకట్టి పక్కకు పెట్టి, మూడు కోట్ల దేవుళ్లతో పాటు 4 కోట్ల ప్రజలను మోసం చేశాడని హరీశ్‌రావు విమర్శించారు. హామీలను ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూ నిలదీస్తుంటే, సీఎం నోటికి ఎంత వస్తే అంత తిట్ల పురాణం మొదలు పెడుతున్నాడన్నారు. తనకు అమీన్‌పూర్‌తో మంచి అనుబంధం ఉన్నదన్నారు. అప్పటి పరిస్థితులు, ప్రజలు సమస్యలు వర్ణనాతీతంగా ఉండేవని, ఇక్కడ మంచినీళ్లు లేక చాలామంది ఇండ్లు అమ్ముకుని వెళ్లినవారు ఉన్నారని గుర్తు చేశారు. రహదారులు లేక అనేక ఇబ్బందులు పడిన తీరు చాలా బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక అమీన్‌పూర్‌కు రూ.60 కోట్లతో రోడ్లు, ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు, మురుగు కాల్వలు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీతో పాటు కొత్త మండలం ఏర్పాటు చేశారని, దీంతో అమీన్‌పూర్ ఘణనీయంగా అభివృద్ధిలో ముందుకు సాగుతున్నదన్నారు. ఇక్కడి భూముల ధరలు అమాంతం పెరిగిపోయి, వ్యాపార రంగంలో దూసుకుపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చి రియల్ ఎస్టేట్ రంగాన్ని అమాంతం కిందికి పడవేయడంతో అమీన్‌పూర్ అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఐలాపూర్‌లో ఆడిన క్రికెట్ మాదిరిగానే రేపటి నుంచి అసెంబ్లీలో సీఎం పాలనను ఎండగడుతూ.. మేం క్రికెట్ ఆడుకుంటామన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్యాయాదవ్, సోమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, అమీన్‌పూర్ కౌన్సిలర్లు బాసెట్టి కృష్ణ, బీజీలీ రాజు, కవితా శ్రీనివాస్‌రెడ్డి, యూనూస్, నాయకులు ప్రమోద్‌రెడ్డి, కాలప్ప, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న హరీశ్‌రావు

## 25న తునికి కేవీకేకు ఉపరాష్ట్రపతి

- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

కౌడిపల్లి, డిసెంబర్ 15: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని తునికి గ్రామ శివారులోని డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రానికి(కేవీకే) ఈనెల 25న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ రానున్నారు. ఆదివారం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్ రెడ్డితో కలిసి గ్రామంలో ఏర్పాట్లును పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రీయ సాగు చేస్తున్న రైతులతో ఉప రాష్ట్రపతి ముఖాముఖి నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ఉత్తమ రైతు బాన్సువాడ గోవర్ధన్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాట ఉన్నన్ని రోజులు..గద్దర్ సజీవం

## గద్దర్ అర్ధ శతాబ్దపు పోరాటయోధుడు... గద్దర్ జీవిత చరిత్రను డాక్యుమెంటరీ చేయాలి



- సిద్దిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ సాహిత్య పుస్తకావిష్కరణ



సిద్దిపేటలో పీపుల్స్ కాన్ఫరెన్స్‌లో గద్దర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, నందినిసిద్ధారెడ్డి



సిద్దిపేట విపంచి కళా నిలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

సిద్దిపేట, డిసెంబర్ 15: గద్దర్ లేని ఉద్యమం లేదని, గద్దర్ అర్ధ శతాబ్దపు పోరాటయోధుడని, పాట ఉన్నంత కాలం గద్దర్ సజీవంగా ఉంటారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట విపంచి కళా నిలయంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీపుల్స్ కాన్ఫరెన్స్ ప్రజాయుద్ధనౌక గద్దరన్న సాహిత్య పుస్తకావిష్కరణ జరిగింది. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కవి, గాయకుడు నందినిసిధారెడ్డి, గద్దర్ కుమారుడు సూర్యలతో కలిసి హరీశ్‌రావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదవుల కోసం ఆశ పడకుండా తండ్రి పోరాటాన్ని, చరిత్రను రేపటి భావితరానికి అందించడానికి సూర్యం ప్రయత్నిస్తుండడం అభినందనీయమన్నారు. ఐదు దశాబ్దాల్లో జరిగిన ప్రతి పోరాటంలో గద్దర్ ఉన్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. విప్లవ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత ఉద్యమం ప్రతి దాంట్లో న్యాయం వైపున నిలిచి అన్యాయాన్ని ప్రశ్నించాడని, మలి దశ తెలంగాణ ఉద్యమంలో గద్దర్ అన్నను కలిసే అదృష్టం కలిగిందన్నారు. గద్దరు ఒక్కపాట 100 ఉపన్యాసాల సారాంశం అన్నారు. చాలా సామాన్య పదాలతో ప్రజల హృదయాల్లోకి చేరే విధంగా గద్దరన్న పాటలు పాడేవారన్నారు. గద్దర్ మన మధ్య భౌతికంగా లేకపోయినా..పాట ఉన్నన్ని రోజులు గద్దర్ సజీవంగానే ఉంటాడన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పొడుస్తున్న పొద్దుమీద పాట తెలంగాణ ఉద్యమాన్ని, సమాజాన్ని ఉర్రూతలూగించి, ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. 2008లో తెలంగాణ కోసం రాజీనామా చేసిన తెలంగాణ ఎమ్మెల్యేలను, ఎంపీలపై తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి అభ్యర్థులను పెట్టాలని నిర్ణయిస్తే అది తప్పని వాదించిన వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అవసరం ఆయితే ప్రచారం చేసి గెలిపిస్తానని చెప్పిన వ్యక్తి గద్దర్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కేసీఆర్‌కు అండగా గద్దర్ నిలబడ్డారన్నారు. తూప్రాన్ మాటిక చెరువులో నీళ్లులేవు...హల్దీ వాగు నుంచి మాటిక చెరువుకు లిఫ్ట్ పెట్టాలని గద్దర్ కోరితే.. 8 నెలల్లో పూర్తి చేసి ఆయనతోనే ప్రారంభింపజేశామన్నారు. తెలంగాణ వచ్చాక జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని గద్దర్ లెటర్ రాస్తే వారికి వెంటనే కేసీఆర్ జీతాలు పెంచారని గుర్తు చేశారు. అది గద్దర్‌కి కేసీఆర్ ఇచ్చిన గౌరవం అని అన్నారు. సిద్దిపేటలో గద్దర్ విగ్రహం పెట్టడం మాకు చాలా గౌరవమని, దానిని ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. గద్దర్ జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ చేయాలని, అందుకు సహకారం అందిస్తానని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లు అవుతున్నా, ఇంకా సమాజంలో అసమానతలు ఉన్నాయని, అవి చేరిగిపోవాలంటే గద్దర్ ఆలోచలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎక్కడైతే అణిచివేత ఉంటాదో.. అక్కడ ప్రభుత్వ అవార్డులకు అర్థం లేదు అనే మాట ఆ రోజు గద్దర్ చెప్పారన్నారు. నేడు నందినిసిద్ధారెడ్డి తిరస్కరించి చూపించారు. తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను మాయం చేసిన రేవంత్ రెడ్డి అవార్డు ఇస్తే తృణప్రాయంగా తిరస్కరించిన నందినిసిద్ధారెడ్డి మన సిద్దిపేట బిడ్డ కావడం నిజంగా గర్వకారణం. త్వరలోనే గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని, సిద్దిపేటలో బహిరంగ సభ నిర్వహించుకుందామన్నారు. కార్యక్రమంలో పోచబోయిన శ్రీహరి యాదవ్, శంకర్, ఆస శ్రీరాములు, సత్తయ్య, సిద్దెంకి యాదగిరి, ఆస లక్ష్మణ్, బీమసేనా తదితరులు పాల్గొన్నారు.



హాజరైన కవులు, కళాకారులు, నాయకులు

### మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి

– మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



గద్దర్ తరగని గని, ఆయన ఆశయాలు అనంతం. 2006లో మొదటిసారి తెలంగాణ కోసం ధూంధాం కార్యక్రమంలో భాగంగా గద్దర్‌ను కలిశాను.. మలి విడత సాంస్కృతిక ఉద్యమానికి గద్దర్‌ను తీసుకువచ్చినం.. కూటికి లేని తల్లిని గురించి ఆలోచించిన వ్యక్తి గద్దర్. ప్రజల ఆశయాల కోసం పాటలు రాసి ప్రజల కోసం పాట పాడిన కవి గద్దర్.. మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి. పాట పాడడమే గగనమైన పరిస్థితుల్లో తెలంగాణ సాంస్కృతిక స్వేచ్ఛకు వెన్నుదన్నుగా బీఆర్ఎస్ నిలిచిందన్నారు. నేడు గద్దరన్న పుస్తకాన్ని ఆవిష్కరించుకోవడం అంటే గద్దరన్నకుండే ఆశయాలను ఆవిష్కరించుకోవడమే. సిద్దిపేటలో హరీశ్‌రావు సహకారంతో విగ్రహాన్ని ఆవిష్కరించుకుంటాం.

### ప్రజలను సాయుధులను చేసిన ఘనత గద్దర్‌ది

–దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ



యుగ స్వరమై మారుమోగిన కవి గద్దర్. ప్రజా గర్జనలో ప్రజాపాటకు రాగం, తాళం సమకూర్చారు. ప్రజలను సాయుధులను చేసిన కవి గద్దర్.. రైతు కూలీల గుండెల్లోనూ, కార్మికుల్లో కొండంత విశ్వాసాన్ని కల్పించిన వ్యక్తి గద్దర్.. తెలంగాణలో భూమి కోసం భూకంపం సృష్టించిన వ్యక్తి, ప్రజా సమూహాన్ని కదిలించిన కవి.. గద్దర్ యుద్ధ నక్షత్రమై నిలిచాడు. గద్దర్ మార్గం అనితర సాధ్యం.. మార్క్సు సిద్ధాంతానికి పాటకట్టిన వ్యక్తి అట్టడుగు ప్రజల జీవితాన్ని రాసి పాడిన కవి.. గద్దర్ ప్రదర్శనను చూడడం అదృష్టంగా భావిస్తున్నా, గద్దరు పాట రాని తెలంగాణ వ్యక్తి ఉండడు... నిస్సహాయులైన ప్రజలను మన పిరంగులుగా మార్చి తన పాటలో మానవీయ కోణాన్ని తీసుకొచ్చాడు. గద్దర్ పాటలను ఏరి సమకూర్చుకున్న సూర్యానికి అభినందనలు.

### పాటల ప్రపంచం గద్దర్

–నందిని సిద్ధారెడ్డి, కవిగాయకుడు



పాటల ప్రపంచం గద్దర్. ఆయన పాటల పుస్తకాన్ని సిద్దిపేటలో ఆవిష్కరించుకోవడం జీవిత కాలం గుర్తుండిపోతుంది. గద్దర్‌తో నాకు 50 ఏండ్ల అనుబంధం ఉంది. ప్రజల పాటలకు సంప్రదాయాన్ని ఇచ్చిన కవి. వరంగల్‌లో 10 లక్షల మందితో నిర్వహించిన రైతు కూలి సభను తన పాటలతో అలరించిన గొప్ప కవి, గాయకుడు గద్దర్. గద్దర్‌తో పోల్చగలిగిన కవి రచయిత లేడు. గద్దర్ మార్గం అనితర సాధ్యం. గద్దర్ నిత్య కార్యాచరణ వాది.

### గొప్ప సాహితీవేత్త గద్దర్

– బక్కి వెంకటయ్య, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

అంబేద్కర్ తర్వాత దళితుల్లో అంతటి మేధావి గద్దర్ మాత్రమే. ప్రపంచానికి గద్దర్ గొప్ప సాహిత్యాన్ని అందించిన సాహితీవేత్త. గద్దర్ విగ్రహాన్ని సిద్దిపేటలో ఏర్పాటుకు తన వంతు సహకారం ఉంటుంది. హరీశ్‌రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు హల్దీ వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. గద్దర్ ఆశయాలను మనమంతా కొనసాగిద్దాం.

## అయ్యప్ప పడిపూజలో హరీశ్‌రావు



అయ్యప్ప మహా పడిపూజలో భాగంగా ప్రత్యేక పూజలు చేస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతారెడ్డి

తూప్రాన్, డిసెంబర్ 15: మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని తాతబాపన్‌పల్లి సమీపంలోని అయ్యప్ప గుడిలో ఆదివారం నిర్వహించిన మహా పడిపూజలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, తూప్రాన్ మాజీ జెడ్పీటీసీ రాణీసత్యనారాయణ గౌడ్, తూప్రాన్ మండల పార్టీ అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, శివ్వంపేట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ రవీందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సతీశ్‌చారి, నాయకులు చంద్రారెడ్డి, సత్తార్, గురుస్వాములు భూపాల్ రెడ్డి, చిన్నలింగ్ శ్రీనివాస్ గౌడ్, వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## హరీశ్‌రావుపై యువరైతు అభిమానం

వరి నారులో టీహెచ్ఆర్ అక్షరాలు కనిపించేలా తుకం పోసిన రైతు

నంగునూరు, డిసెంబర్ 15: సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని మగ్ధుంపూర్ గ్రామానికి చెందిన ఓ యువ రైతు వరి నారుమడిలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై అభిమానాన్ని, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డిపై తన విధేయతను వినూత్నంగా చాటుకున్నాడు. గ్రామానికి చెందిన చిట్యాల సురేశ్ పొలంలో టీహెచ్ఆర్, జేఎస్ఆర్ అనే అక్షరాలు కనబడేలా వడ్లను తుకం పోసి అలుకుడు చేశాడు. ఆ అక్షరాలు నారులో అందంగా కనిపిస్తున్నాయి. హరీశ్‌రావు అంటే తనకెంతో అభిమానమని, ఆయనపై ఉన్న అభిమానం, గౌరవంతో వినూత్నంగా అలుకుడు చేసినట్లు సరేశ్ తెలిపారు. అంతేకాదు మండల మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి పేరులో జేఎస్ఆర్ వచ్చేలా తన విధేయతను చాటుకున్నట్లు తెలిపారు.

## వివాదాలకు కేరాఫ్‌గా గిర్మాపూర్ గురుకులం

విద్యార్థుల మధ్య ఘర్షణ.. గురుకులాన్ని సందర్శించిన ఆర్డీవో, డీఎస్పీ

కొండాపూర్, డిసెంబర్ 15: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్ గురుకుల పాఠశాల వివాదాలకు కేరాఫ్‌గా మారింది. శనివారం రాత్రి 6, 10వ తరగతి విద్యార్థుల మధ్య తినుబండారాల విషయంలో పెద్ద గొడవ జరిగింది. నెల వ్యవధిలోనే ఇది మూడో సంఘటన. తల్లిదండ్రులు పిల్లల్లకు తినుబండారాలు ఇవ్వండతో 10వ తరగతి విద్యార్థులు పిల్లల వద్ద నుంచి పెట్టెలను పగులగొట్టి వాటిని ఎత్తుకెళ్లారు. దీంతో విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. ఇది తెలుసుకున్న టీచర్ వారందరితో మాట్లాడి గొడవను సద్దుమణిగించారు. ఈ గురుకులంలో ఇంతకుముందు విద్యార్థులు ఉండే గదుల్లో కరెంటు బోర్డులు, కిటికీలు కూడా సరిగ్గా లేవు. బాతురూంలు అయితే మరీ చెప్పలేనంతగా కంపు కొడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఇటీవల పెద్దఎత్తున గొడవలకు దిగిన సంఘటన మరువక ముందే మరో ఘటన చేటు చేసుకుంది. అధికారులు ఎవరు వచ్చినా పాఠశాలను చూసి వెళ్లిపోతున్నారు. కానీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించలేక పోవడం విచారకరం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ వ్యాప్తంగా గురుకులాలు చాలా బాగుండేవని చెబుతున్నారు. ఇటీవల విద్యార్థులకు పురుగుల అన్నం, నీళ్లచారు పెట్టి విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ సత్తయ్య

### పాఠశాలను సందర్శించిన ఆర్డీవో

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని గిర్మాపూర్ గురుకుల పాఠశాలను ఆదివారం సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ సత్తయ్య సందర్శించారు. సోషల్ మీడియాలో గిర్మాపూర్ గురుకులంలో 6,10వ తరగతి విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగినట్లు వార్తలు రావడంతో పాఠశాలను సందర్శించామన్నారు. కానీ హాస్టల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ అవాస్తవమన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నమ్మవద్దని సూచించారు. విద్యార్థులు నివసించే గదులతోపాటు వంట గదులను, పరిసరాలను పరిశీలించామన్నారు. ఎక్కడా సమస్యలు లేవన్నారు. అనంతరం ఆరు, పదో తరగతి విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడామని, గొడవలు జరగలేదని తెలిపారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్తేర్ అజిత్, కొండాపూర్ సీఐ వెంకటేశ్వర్, ఆర్ఐ మహదేవ్, కొండాపూర్ ఎస్ఐ హరిశంకర్, ప్రిన్సిపాల్ నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భార్యను అడవిలో వదిలివెళ్లిన భర్త



స్పృహతప్పి పడిపోయిన రబియా

ములుగు, డిసెంబర్ 15: ఓ వ్యక్తి తన భార్యను అడవిలో వదిలివెళ్లాడు. ఈ ఘటన ములుగు మండల పరిధిలోని వంటిమామిడి గ్రామ శివారులో జరిగింది. పోలీసులు, స్థానికులు వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన విక్రమ్ మన్వర్ ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంటున్నాడు. అక్కడ రబియా అనే యువతితో పరిచయం ఏర్పడటం వల్ల ఈనెల 4న వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలోనే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఇటీవల హైదరాబాద్‌కు వచ్చారు. కాగా తరచు గొడవలు జరగడంతో శనివారం సాయంత్రం రబియా పెయిన్ కిల్లర్ మాత్ర లు మిం గింది. దీంతో భర్త విక్రమ్ ఆమెను తీసుకొచ్చి వంటిమామిడి అడవిలో వదిలి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆర్వీఎం దవాఖానకు తరలించి యువతి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఐఐటీహెచ్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



2014 పూర్వ విద్యార్థులతో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, ప్రొఫెసర్లు

సంగారెడ్డి డిసెంబర్ 15(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2014 బ్యాచ్‌కు చెందిన ఐఐటీ విద్యార్థులతో దశాబ్ది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 2014 పూర్వ విద్యార్థులు సొంత నిధులతో ఐఐటీ హైదరాబాద్‌లో 'పబ్లిక్ రిలేషన్స్ స్టూడియో' నిర్మించారు. డైరెక్టర్ బీఎస్ మూర్తి పబ్లిక్ రిలేషన్స్ స్టూడియోను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు ఐఐటీ హైదరాబాద్‌కు గొప్ప సంపదగా అభివర్ణించారు. వారు సాధిస్తున్న విజయాలు ఐఐటీహెచ్ మరింత ఉన్నతస్థాయికి చేరేందుకు స్ఫూర్తిని నింపుతున్నట్లు చెప్పారు. ఐఐటీ హైదరాబాద్ పురోభివృద్ధిలో పూర్వ విద్యార్థులు తమవంతు పాత్ర పోషిస్తుండటం ఎంతో గర్వంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు ఎన్నో ఘన విజయాలు సాధించటం ద్వారా ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు మార్గదర్శకులుగా మారుతున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులతో కలిసి అద్భుతమైన వారసత్వాన్ని నిర్మిస్తామని చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థి, యూపీఎస్ ఈఎస్ఈ(సివిల్) టాపర్ రోహిత్‌ను ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఘనంగా సన్మానించారు. డా.మనోహర్ కాకునూరి, డా.శివగణేశ్ తమ రంగాల్లో ఉన్నతస్థాయికి ఎదిగినందుకు అభినందిస్తూ ఐఐటీహెచ్ తరపున డైరెక్టర్ బీఎస్ మూర్తి టెక్నాలజీ డెవలప్‌మెంట్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యూపీఎసీ ఈఎస్ఈ టాపర్ రోహిత్ మాట్లాడుతూ.. యూపీఎస్సీలో టాపర్‌గా నిలిచేందుకు ఐఐటీహెచ్ కారణమని తెలిపారు. తన విజయానికి పునాది ఐఐటీహెచ్‌లోనే పడిందన్నారు. ఐఐటీహెచ్‌కు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుందని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఐఐటీహెచ్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తాము చదువకున్న ఐఐటీహెచ్ తాత్కాలిక క్యాంపస్‌ను పూర్వ విద్యార్థులు సందర్శించి నాటిరోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి